# అంతర్ముఖం

నా జీవితంలో ఈ సంఘటన ఒక అపూర్వమైన అనుభవం. ఈ అనుభవం వల్ల నా ఇరవై తొమ్మిదేళ్ళ వయసుతోపాటు సంప్రదాయ సంచితంగా వచ్చిన నా ఊహలూ, ఆలోచనలూ, భావోద్రేకాలూ, సంస్కార విశేషాలూ అన్నీ తలకిందులయ్యాయి. ఈ సంఘటనలోని సన్నివేశాల్లో ఏవి సంబద్ధమైనవో, ఏవి కావో నాకు తెలియకపోయినా, ఇది మాత్రం నిజం.

సీతమ్మ మా పనిమనిషి. సీతమ్మ కూతురు జయలక్ష్మి. పదిహేనేళ్ళుండవచ్చు. చూడటానికి బావుటుంది. ఇద్దర్లో ఎవరో ఒకరు క్రమం తప్పకుండా రెండు పూటలా ఇంట్లో పని చేసేవాళ్ళు. వాళ్ళిద్దరూ మా ఇంట్లో బాగా అలవాటైపోయారు-మరీ ముఖ్యంగా నా భార్యకు. వాళ్ళను అలవాటు చేసుకోక తప్పని పరిస్థితి కూడా మాది.

నెల కిందటే, అయిదో నెల దాటకుండా నా భార్య పుట్టింటి నుంచి పాపను తీసుకొని వచ్చింది. అయిదేళ్ళ కాపురం తర్వాత అపురూపంగా పుట్టినపిల్ల. ఆరోగ్యం అంతంతమాత్రం. ఏడుపు ఎక్కువ. నేనేమో వంటింట్లో నా భార్యకు సాయపడగలిగే కుటుంబ సంస్కృతి నుంచి రాలేదు.

పిల్లను పొద్దస్తమానం పట్టుకోవటం చేతకాదు.

ఈ పరిస్థితుల్లో సీతమ్మా, జయమ్మా ఒక రకంగా మాలిమి అయ్యారు. చాలా మార్లు అమ్మా, కూతురూ కలసే వచ్చేవాళ్ళు.

జయలక్ష్మి ఇంట్లో ఉన్నంత సేపూ, మా పాప ఆ అమ్మాయి చంకలోనే వుండేది. వాళ్ళను గురించి ప్రస్తావన వస్తే "బతికి చెడిన సంసారం పాపం!" అనేది నాభార్య, జాలితో.

ఇల్లూ, కాలేజీ - ఏ గొడవలు లేకుండా జరిగిపోతున్నాయనుకుంటూంటే, మొన్న

శనివారం ఒక అవాంతరం వచ్చి పడింది.

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అటుగా ఎదురు సందుగొందుల్లోని ఒక గొందిలో వేశ్యా వ్యాపారం సాగిస్తోందని ఒకామె ఇంటి మీద చీకటి పడింది చూసి పోలీసులు దాడి చేశారు.

ఆ ఇంటి వెనుక నుంచి వస్తున్న జయలక్ష్మిని కూడా పోలీసులు స్టేషనుకు పట్టుకుపోయారు. ఈ విషయాన్ని రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో నా భార్య నాకు చెప్పింది. ధర్మరాజు గుడివైపు షికారుకు పోయి వచ్చాక. విషయం విని ఆలోచనలోపడిన నన్ను చూసి నా భార్య అంది:

"ఇంత దాకా నీ కోసం చూసి చూసి పోయింది. సీతమ్మ. అవస్థ చూడలేక పోయినాననుకో. గోడువిని బాధేసింది. జరిగింది అన్యాయం. పెళ్ళీడుకొచ్చిన పిల్ల. దాని బతుకేమయిపోతాది ఏందన్నా జరిగితే?"

నా అశక్తత కావచ్చు. ఆ ప్రశ్నకు కొంచెం కోపం వచ్చింది. విసుగ్గా అన్నాను.

"పోలీసులతోపని. నన్నేం చెయ్యమంటావు. పైగా రాత్రి".

నిద్రలో ఉలిక్కిపడి లేచి ఏడవడం మొదలుపెట్టిన పాపను చంకలో కుదేసుకొని నా భార్య అంది.

"నువ్వే ఏం చెయ్యలేకపోతే సీతమ్మ ఏం చేస్తుంది? ఏడుస్తూ మూలన కూకుంటుంది- రేపు పనికి కూడా రాకుండా. బతికి చెడింది అంతకన్నా చేసేదేముంది? ఈ రాకాసి పిల్లతో నేనొక దాన్నీ ఏ పనీ చేసుకోలేను - సీతమ్మో, జయమ్మో లేకపోతే. నీకు కాలేజీలో పాటాలు చెప్పడం తప్ప ఏమీ తెల్దు. అరగంట పిల్లను పట్టుకోలేరు. ఆఁ గ్నాపకం వచ్చింది... నీకు సబిన్స్పెట్టరు తెలుసుగావాలనే. మనింటికి రెండుసార్లు వచ్చినాడే. కాఫీ టిఫన్ కూడా పెట్టినా. ఇప్పుడు సాయం చెయ్యలేడా? సమయానికి ఆదుకోకపోతే సంకనాకనా ఈ స్నేయితాలు?"

నా భార్యచివర ప్రయోగించిన మొరటు సామెతకు నవ్వు వచ్చింది. ఆమె అంతే - జాలిపడి, నవ్వు ఆపుకున్నా. ఆలోచించి "సరే" అన్నా-కొంత స్వార్థం కావచ్చు, కాస్తో కూస్తో కారుణ్య దృష్టి కావచ్చు. నా భార్యతో ఈ విషయంగా అనవసరమైన వాగ్యుద్ధంలోకి దిగడం ఇష్టంలేక కావచ్చు-పోలీస్ స్టేషనుకు బయలుదేరాను. దారిలో అనుమానం పీడించసాగింది. రకరకాల సందేహాలు కలిగాయి.

నా భార్యకు సీతమ్మ చెప్పింది నిజమో కాదో? జయలక్ష్మి మంచిదో చెడ్డదో? జయలక్ష్మి ఆ సమయంలో అటువైపు ఎందుకు వెళ్ళినట్లు? తీరా వెళ్ళాక, సబిన్స్పెక్టర్ రత్నం నా మాట వింటాడో లేదో?

రత్నం నాకు యూనివర్సిటీలో హాస్టల్మేట్. యూనివర్శిటీ వదిలాక నాలుగేళ్ళు కలవలేదు. కందుకూరు నుంచి కాళహస్తికి ట్రాన్స్ఫర్ అయివచ్చాక, ఒకమారు ఆలయం దగ్గర రత్నం డ్యూటీలో వుండగా చూశాను.

సందేహిస్తూనే నవ్వుతూ పలకరించాను. అతనూ సమాధానంగా నవ్వాడు. తర్వాత కొంత సేపు మాట్లాడుకున్నాం. "స్టేషన్కు వస్తూ ఉండు" అన్న రత్నం ఆహ్వానానికి బదులుగా ఒక మారు స్టేషనుకు వెళ్ళి పలకరించాను. ఇంటికి పిలిచాను. రెండు మార్లు రత్నం మా ఇంటికి వచ్చాడు. అతని రాక మూలంగా చుట్టుపట్ల నా పరపతి పెరిగినట్లు కనిపించింది. సంతోషంతోపాటు గర్వం కూడా కలిగింది. మూడో మారు పలకరించటానికి స్టేషనుకు వెళ్ళినప్పుడు మాటలను బట్టి రత్నం అన్నా, పోలీసులన్నా భయం పట్టుకుంది. బహదూర్పేటలో

మా ఇంటి వెనుక కొంత దూరంలో వుండే ఒకరిద్దరు పేర్లను రత్నం ప్రస్తావించాడు. వాళ్ళు దొంగ సొత్తులు తీసుకునే రిసీవర్లనీ, దొంగలను వాళ్ళ డబ్బు అవసరాల్లో ఆదుకుంటూ దొంగతనాలు చేయిస్తారనీ, 'అటువంటి వాళ్ళను పట్టుకుంటే మనకు మంచిదనీ ఇన్ఫార్మర్లను సంపాదించడంలో తోడ్పడమనీ' రత్నం నన్ను కోరాడు. తన కింద పని చేసే పోలీసుల మీద తనకు నమ్మకం లేదని చెప్పారు.

ఆ సన్నివేశం జరిగిన రెండోరోజో ఏమో, మా కాలేజీ మిత్రులు రత్నం వ్యవహార శైలిని గురించి చర్చించుకోవడం విన్నాను.

దొంగసొత్తు సంపాదనలో రత్నం ప్రణాళికా బద్ధంగా రెండు మూడు నెలల్లోనే లక్షలు సంపాదించాడనీ, రిసీవర్లను బెదరించి డబ్బు గుంజుతాడనీ, కొంత బంగారాన్ని వాళ్ళ దగ్గర దొరికినట్లు ఏర్పాటు చేసుకొని, అందులో కొంత సొమ్ము పోగొట్టుకున్న ఆసాములకు కోర్టు ద్వారా అందజేసి కేసులు పట్టుకున్నట్లు, న్యాయం చేసినట్లు నాటకం ఆడి సంపాదిస్తున్నాడనీ, దీనికి ఎం.ఒ. మోడస్ ఆపరెండి - అనే ముద్దుపేరు పెట్టుకున్నాడనీ విన్నాను. సాటి లెక్చరరు అనుభవం ఒకటి ప్రస్తావనకు వచ్చింది కాబట్టి, నమ్మక తప్పలేదు.

ఇట్లాంటి రత్నం జయలక్ష్మి విడుదల విషయంలో నాకు ఏ రకం సహాయం అందించగలుగుతాడో తలుచుకుంటూంటే బెదురు పట్టుకుంది. జయలక్ష్మిని విడిపించగలడనుకునేట్లు ఇంట్లోంచి వీరోచితంగా బయలుదేరిన నేను, పనికాక తిరిగి వెళితే కొంత అవమానాన్నయినా ఎదుర్కోక తప్పదు. నా భార్య తప్పకుండా తన మాండలికంలో జాతీయాలూ, సామెతలూ జోడించి పూజ చేస్తుంది. తన మాట పట్ల అంత ఆపేక్ష ఆమెకు. చచ్చినన్ని సందేహాలతో పోలీసు స్టేషన్ చేరుకున్నాను.

స్టేషను ముందు గొంతుక్కూర్చొని, ఏడ్చి ఏడ్చి అలసిపోయిన కళ్ళతో ఉన్న సీతమ్మ నన్ను చూస్తూనే బావురుమంది. "సార్, వచ్చినారా?" అంటూ చేతులు పట్టుకుంది. భయపడవద్దని చెప్పి స్టేషన్ వరండా మెట్లు ఎక్కాను. వరండాలో వున్న కానిస్టేబుల్‌కు నేను తెలుసునని గుర్తించాను.

"ఏం సార్! ఇట్లా వచ్చినారు" అని అడిగాడు.

"రత్నం లేడా" అన్నాను.

"ట్రాన్స్‌ఫరు అయిపూడ్చి నెలపైన్నే అయింది గదా సార్. మీకు తెలీదా?"

"సమ్మర్ వెకేషన్ గదా. ఊళ్ళోలేను. అన్నాను. కొంత నిజం, కొంత అబద్ధం.

"కొత్త సారు వచ్చి చేరినాడు. ఇప్పుడుదానే ఇంటికి పూడ్చినాడు. పనేమైనా వుందా సార్? ఆ అప్ప ఇప్పుడు రాడు".

నీరసంగా సందేహిస్తూనే విషయం చెప్పాను.

"అమ్మ నాయనోయ్. సీతా కేసే సార్! కొత్తసారు మా ప్రాణాలు తీస్తున్నాడు. చార్జి తీసుకుని పది రోజులయిందో లేదో గడగడలాడిస్తున్నాడు. - స్టేషన్నూ, జనాన్నీ. పొద్దున ఏడింటికి దానా వచ్చినానా? కాఫీనీళ్ళు తప్ప తిండి లేదు. హోటల్లో మాట్లాడుకుందాం పదండి సార్".

అక్కడున్న పోలీసులిద్దరికి ఏదో చెప్పి బయటికి కదిలాడు. నాన్‌వెజిటేరియన్ హోటల్లో ఇరవై అయిదు రూపాయలయింది. మర్యాద కోసం నేనే బలవంతంగా బిల్లు చెల్లించాను. అప్పుడు చెప్పాడు.

"బిల్లు మీ చేత్తో పెట్టించాల్సి వచ్చింది సార్. మా ఇన్‌స్పెక్టరు సారుకు మేం చెప్పినా

ఆ అప్పు మమ్మల్ని నమ్మడు. ఆ అప్పు దృష్టిలో పాత కేడీగాళ్ళ కంటే అన్యాయమై పూడ్చింది మా బతుకు. ఈ అప్పుకు ఎవరు ఇన్ఫర్మేషన్ ఇచ్చినచ్చినారో ఏమో - స్టుడెంట్లూ, ఇద్దరు ముగ్గురు లెక్చరర్లు దానింటికి రెగ్యులర్ కష్టమర్లని. ఈ పొద్దు రెయిడ్ చేస్తిమి. మీరు చెప్పిన పిల్ల కూడా దొరికింది. మా వాళ్ళకు దొడ్డి దోవలో. తప్పో ఒప్పో ఏం చెయ్యాలసార్?

ఆ మాటలు విని నాకు ఏం చెయ్యాలో పాలు పోలేదు.

"ఆ పిల్ల గతి...?" అడిగాను.

"ఏం కాదుసార్. నన్నుదానమ్మండి. సోమవారం కోర్టులో అయిదో పదో జరిమానా వేస్తురు. కడితే సరిపూడుస్తుంది". అతి సామాన్యమైన విషయమన్నట్లుగా కానిస్టేబుల్ చెప్పాడు.

"వద్దు వద్దు. కోర్టుకు తీసుకువెళ్ళటం వాళ్ళకెంత నామర్దా? తల్లి ఏ బావిలోకో దూకి చస్తుంది". అన్నాను.

"అవును సార్. నాకు వాళ్ళు తెలుసు. ఒకప్పుడు బాగా బతికినవాళ్ళే నిన్న రాత్రి నేను డ్యూటీలో లేను..."అన్నాడు.

అతని చేతుల్లో సమస్యకు పరిష్కారం లేదని తెలిసిపోయింది. సబిన్స్పెక్టర్నే కలవక తప్పదు. కానీ, పది దాటింది. పొద్దున్నే వచ్చి,జరిగింది పొరపాటై వుండవచ్చు అని చెబితే వినకపోతాడా అనిపించింది. ఆ మాటే కానిస్టేబుల్తో అన్నాను.

"మీ ఇష్టం సార్. రత్నం సారు మీకు తెలుసునని మాత్రం చెప్పకండి. కేసు అడ్డం తిరుగుతుంది". కానిస్టేబుల్ హితబోధలోని అంతర్యం అర్థమైంది.

మాటిమాటికీ చెంగుతో కళ్ళు ఒత్తుకుంటూ కుళ్ళుకుంటున్న సీతమ్మకు ధైర్యం చెప్పి వాళ్ళ ఇంటికి పంపించాను. మా ఇంటికి బయలుదేరాను. నా భార్య మాట విని తొందరపడి ఇందులో ఇరుక్కున్నానేమో అనిపించింది. ఒకటి రెండు రోజులు పనిమనిషి లేకపోతే ఏం మునిగిపోతుంది? ఈ గొడవలో సీతమ్మ రాకపోతే పోనీ, అంతగా అయితే, కొత్త పనిమనిషిని వెతుక్కోవచ్చు అనే ఆలోచన వచ్చింది.

ప్రతి సమస్యనూ మనం పట్టించుకోలేం. ఒకవేళ పట్టించుకున్నా, దాని పరిష్కారం మన చేతుల్లో లేదు అనిపించింది.

ఇంటికి వెళుతూనే నా భార్య "ఏమైంది" అని అడిగింది.

అంతా విని "మన చేతుల్లో లేకపోతే చేసేదేముంది" అంది.

పొద్దున్నే సీతమ్మ వచ్చి ఇంటి పనిచేయటం చూసి నాకు ఆశ్చర్యమైంది. పని అంతా అయ్యాక "సార్! నువ్వే నాకు దిక్కు" అని చేతులెత్తి మొక్కింది. నాకంటే వయసులో పెద్దది. రాత్రి నిద్రాహారాలు లేవేమో పీక్కుపోయిన సీతమ్మ ముఖాన్ని చూసి, మరొక ప్రత్నం చేద్దామనిపించింది.

సబిన్స్పెక్టర్ ఇంటికి వెళ్ళి కలిస్తే మంచిదనుకున్నాను. ఉదయం ఏడు గంటల ప్రాంతంలో వెళ్ళి ఆ ఇంటి ఛాయల్లో కాసేపు తచ్చాడాను. ఎవరో ఆడ మనిషి కిటికీలోంచి నన్ను గమనిస్తున్నట్లు చూసి లోపలికి వెళ్ళే సాహసం చేయలేకపోయాను.పది గంటల ప్రాంతంలో సబిన్స్పెక్టర్ స్టేషన్లో దొరికాడు. ఎక్కడో చూసిన ముఖం లాగుంది అనుకున్నాను. గుర్తు రాలేదు. నమస్కారం చేసి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. మర్యాదపూర్వకంగా "కూర్చోండి" అన్నాడు.

కూర్చున్నాను. టీ తెప్పించాడు. కుదుట పడ్డాను. అప్పుడు జయలక్ష్మి విషయం

ప్రస్తావించాను.

"ఆ అమ్మాయి విషయంలో మీకేం ఇంట్రెస్ట్?" సబిన్స్పెక్టర్ సూటిగా అడిగిన ఆ ప్రశ్నకు ఉలిక్కిపడ్డాను. అది ప్రమాదకరమైన ప్రశ్నలా కనిపించింది.

ఇబ్బందిగా గొనిగాను. "మా పనిమనిషి కూతురు".

"ఆ అమ్మాయి తప్పు చేయలేదని మీరెలా నమ్ముతున్నారు?"

సీతమ్మ,జయలక్ష్మి గురించి నాకు తెలిసిన విషయాలు చెప్పాను.

"మీకు జాలి ఎక్కువనుకుంటాను".

ఏమని సమాధానం ఇవ్వను?

"మీరు కందుకూరులో పనిచేశారా?"

ఈ ప్రశ్న ఎందుకు? అయినా, ఈ విషయం ఇతనికెట్టా తెలుసు? ఆశ్చర్యపోయాను. "అవును. మొదటి మూడేళ్ళు అక్కడ పనిచేశాను. ఈ మధ్యనే ప్రొద్దుటూరు నుంచి ట్రాన్స్ఫర్ మీద ఇక్కడికి వచ్చాను" అన్నాను.

"అక్కడ పద్మబాల అనే అమ్మాయి మీకు తెలుసా?"

నాకు గుండెలు కొట్టుకోసాగాయి- ఏం ప్రశ్నలివి అనుకుంటూంటే. నాకు తెలిసిన అయిదారు మంది మా విద్యార్థినుల పేర్లు గుర్తు చేసుకోడానికి తంటాలు పడ్డాను. పద్మబాల ఎవరో గుర్తుకు రాలేదు. ఆ మాటే చెప్పాను - ఆందోళననూ, చిరాకునూ దాచుకుంటూ.

సబిన్స్పెక్టర్ మరొక ప్రశ్న గురిచూసి వేశాడు.

"మీ కాలేజీలో వుండే ఆ కుర్ర తెలుగు లెక్చరర్ సుబ్బన్న ఎలాంటివాడు?"

సుబ్బన్న గురించి ఏవో అవీ ఇవీ విన్నా ఏమని చెప్పను, అదీ పోలీసు అధికారి ముందు?

"మనం చూసినవన్నీ నిజం కానట్లే, విన్నవన్నీ నిజం అని నమ్మలేం కదా?" అన్నాను నా కసి పైకి కనిపించనివ్వకుండా.

"మీ లెక్చరర్లలో కొందరికంటే మా పోలీసులే నయం. మీరూ, మీ స్టూడెంట్స్ వున్నట్లే మేమూ, మా పోలీసులూ...." సబిన్స్పెక్టర్ బిగ్గరగా నవ్వాడు.

"సరేలెండి... జయలక్ష్మిని వదలి పెడుతున్నాం" అన్నాడు చివరగా.

"థాంక్స్" అన్నాను.

సీతమ్మ సబిన్స్పెక్టరుకూ, నాకూ మొక్కి మొక్కి కూతుర్ని తీసుకొని వెళ్ళిపోయింది. ఏదో సాధించినట్లు గర్వపడ్డాను.

నేనూ వెళ్ళడానికి ప్రయత్నిస్తూంటే, "ఒక నిముషం కూర్చోండి" అన్నాడు.

తను లేచి స్టేషన్ ముందున్న మోటర్ సైకిల్ స్టార్ట్‌చేసి. "రండి" అని పిలిచాడు.

నాకు మతి పోయింది. మోటర్‌సైకిల్ వద్దకు వెళ్ళి అయోమయంగా చూశాను. "కూర్చోండి" అన్నాడు. కూర్చున్నాను. వెళుతూ అన్నాడు. "సారీ, నా పేరింతవరకూ మీకు చెప్పలేదు....సాగర్."

వాళ్ళ ఇంటి దగ్గర మోటర్‌సైకిల్ ఆపేవేళకు నా బుర్ర పనిచెయ్యడం మానింది. యాంత్రికంగా సాగర్ వెంట అతని ఇంట్లోకి నడిచాను. హాల్లో కూర్చున్నాం.

"పద్మబాలా!" సాగర్ పిలిచాడు.

పరిచయం చేస్తున్నప్పుడు నేను ప్రతినమస్కారం చేస్తున్నప్పుడు ఆమె బాగా పరిచితమైన వ్యక్తిగా కనిపించింది....ముఖ్యంగా ఆ కళ్ళు...

"గుర్తున్నానా మాష్టారూ? అక్క బావుందా?"

తల ఊపాను. అవును...గుర్తుకొచ్చింది.

"ఉండండి. జూస్ తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది.

నాకేమీ పాలుపోవటంలేదు. ఏం మాట్లాడటానికీ నోరు పెగలటంలేదు. టీపాయి మీదున్న తెలుగు పత్రికల్ని తిరగేస్తూ కూర్చున్నాను. పద్మబాల మూడు గ్లాసుల్లో జ్యూస్ తెచ్చింది. మాకిద్దరికీ ఇచ్చి తానూ ఒక గ్లాసు తీసుకొని ఎదురుగా కూర్చుంది కళ్ళతో నవ్వుతూ.

గోడకున్న 'మోనాలిజా' పటాన్ని చూస్తూ జ్యూస్ నెమ్మదిగా తాగటం మొదలు పెట్టాను.

సాగర్ మాట కలిపాడు.

"మీకు గుర్తుందా? ఒంగోలు నుంచి కావలి వరకూ ఒకే కంపార్ట్‌మెంట్‌లో మనం ముగ్గురం ప్రయాణం చేశాము. ఆ కంపార్ట్‌మెంట్‌లో మనం ముగ్గురం తప్ప ఎవరూ లేరు. మాకు పెళ్ళయి వారం రోజులైంది. మేము కావలిలో బంధువులింటికి వెళ్తున్నాం.

మా ఎదురుగా మీరు కూర్చున్నారు. మిమ్మల్ని చూస్తూనే ఈమె కంగుతింది. మీరు మొదట్లో గమనించలేదు. తర్వాత గమనించారు. పడుకొని వున్న ఈమె కళ్ళనూ, మీ వైపు చూడటాల్నీ మీరు దొంగ దొంగగా చూశారు. నాకు కోపం వచ్చి మిమ్మల్ని రైల్లోంచి తోసివేద్దామనుకున్నాను. తమాయించుకున్నాను. సింగరాయ కొండలో ఈమె నీళ్ళు కావాలంది. సీసా తీసుకొని ఫ్లాట్‌ఫారం మీదికి వెళ్ళాను. రైలు కదిలింది. మీరు తలుపు వద్ద కొచ్చి నాకు చెయ్యి అందించారు.

అన్నట్లు, ఆ కన్నీళ్ళకు ముందు మీ ఇంట్లో జరిగిన రెండు కథల్ని కూడా చెప్పింది లెండి ఆ తర్వాత పద్మబాల-మీ ఆవిడను మీ భార్య అని తెలియక ఒక రోజు అడిగిందటగా, 'ఆ వరండాలో చదువుకుంటున్న అబ్బాయి మీ తమ్ముడా' అని. మీ ఆవిడ 'సుబ్బరంగా మొగుడు' అందట కదా? మరొక మారు మీరొక్కరే ఇంట్లో వున్నప్పుడు వచ్చిఎదురుగా పది నిముషాలు కళ్ళప్పగించి చూసినా మీరు పట్టించుకోకుండా బయటికి సాగనంపారట గదా? మేనత్తగారింట్లో సెలవులు గడిపి ఊరు వెళ్తున్నానని మీకు చెప్పటానికి వచ్చిందటపాపం!"

సాగర్ పడి పడీ నవ్వాడు. నాకు గుండె అదురుతోంది. ఏమిటిదంతా అని.

పద్మబాల అందుకొంది.

"మొదట్లో సాగర్ చాలా అనుమాన పడ్డాడు మాష్టారూ... ఏదో చిన్నతనం. ఇంటర్ చదువుతున్న రోజులు... అర్థంలేని వ్యామోహాలు, పిచ్చి కలలు.... అదే ఒక రోజు మోహం మీద గుద్దినట్లు చెప్పాను సాగర్‌కు 'ఆ మాష్టారు ఆవాళ చెడగొట్టాలనుకొని వుంటే చెడిపోయి వుండేదాన్ని. ఆమాత్రం నీతి మగవాళ్ళలో వుంటే చాలు. ఆయన మనసులో ఏముండేదీ నాకెందుకు? మీ మనసులో ఎందరాడవాళ్ళను చెరిచారో. రోజా చెరుస్తున్నారో నాకు తెలుసా' అని. సాగర్‌కు అప్పటికి తిక్క కుదిరిందనుకోండి. ఏమైనా, మిమ్మల్నీ, అక్కనూ చూశాక పెళ్ళి నీతి అంటే ఏమిటో తెలిసి వచ్చింది."

ఆ పొగడ్తకు నేను తగనని నాకు తెలుసు. ఆ మాట చెప్పలేకపోయాను.

"మాష్టారూ! ఉదయాన్నే మా ఇంటిముందు మీరు తచ్చాడటం చూశాను. మీరింట్లోకి రాలేదు. నేను గుర్తు పట్టాను. ఇంట్లో వున్న కానిస్టేబుల్ని 'ఆయన సాగర్‌కు తెలుసా, నీకు తెలుసా' అని అడిగాను. రాత్రి మీరు సాగర్ కోసం వచ్చిన విషయం చెప్పాడు. అనుమానం

వేసి మాటల సందర్భంలో అసలు విషయం రాబట్టాను. ఆ స్కౌండ్రల్ తెలుగు లెక్చరర్ ఇంట్లో నిన్న జయలక్ష్మి అనే అమ్మాయి వాళ్ళమ్మకు బదులుగా పని చేయటానికి వెళ్ళిందట. చీకటి పడ్డం చూసి చెయ్యి పట్టుకున్నాడు. పెళ్ళయిన వెధవ కూడా. కంగారులో, భయంతో ఆ అమ్మాయి వీధిలోకి పరిగెత్తింది. దొడ్డి తలుపును తోసుకొని పరుగెత్తుతూ వచ్చిన శరీరాన్నమ్ముకునే పిల్ల, పాపం ఆ గొడవలో ఈ అమ్మాయిని ఢీ కొట్టింది. సాగర్ భటులు పట్టుకున్నారు... మీ జోక్యమే లేకపోతే ఈ కథ బయటికి వచ్చివుండేది కాదు. ఆ అమ్మాయిపైన వేశ్య ముద్ర పడేది. ఏమైనా, ఆడవాళ్ళ ముందు పోలీసుల సాహస ప్రదర్శన ఇలాగే వుంటుంది. మగ వెధవల్ని తన్నే శక్తి లేదుగానీ, వ్యభిచార నిర్మూలన చట్టం ఇంగ్లీషు పేరు 'సీతా' అట. సీతల్ని రావణులు బంధించినట్లు బంధించేది ఆ లెక్చరరు వంటి వాళ్ళూ, వీళ్ళూ, ఈ కోర్టులూ చీమూ నెత్తూరూ వున్న వాళ్ళు సిగ్గు పడాలి ఈ వైభోగం చూసి...

పద్మబాల ఆవేశం చూసి హడలిపోయాను. కొన్నేళ్ళక్రితం బంధువులింటికి వచ్చి నెల రోజులపాటూ మా ఇంట్లో పాలు పోసిన ఆ అమ్మాయేనా ఈ పద్మబాల?

"మరీ అంత ఆవేశపడకు. కొంచెం న్యాయం చూడు. కనీసం మా ఇద్దరినైనా ఆ మగ వెధవల మందలో చేర్చకు." సాగర్ ఛలోక్తికి నేను భుజాలు తడుముకున్నట్లయింది.

పద్మబాల కళ్ళలోకి చూడకుండా తప్పించుకొని, సాగర్‌వైపు చూసి సెలవు తీసుకొని బయటపడ్డాను. ఒకప్పటి పిరికితనం ముసుగు కప్పుకున్న నా కుసంస్కారాన్ని అసలు సిసలు పెళ్ళి నీతిగా పద్మబాల వర్ణించటమే నన్ను కాల్చుకుతింటోంది. సాగర్, పద్మబాల చర్చించిన సన్నివేశాల్లో జరిగిన విషయాలు నిజమే.

ఆ రోజుల్లో నన్ను తొలిచేట్లు చూశాయనుకున్న పద్మబాల కళ్ళను, గొగోల్ 'చిత్తరువు'లో వర్ణించినట్లు నన్ను తప్ప, మరింక దేన్నీ చూడటం ఇష్టం లేనట్లు, సర్వాన్నీ కాదని నన్నే సూటిగా చూసినట్లు, నాలోకే చూసినట్లు అనిపించిన ఆ కళ్ళను, కొన్నేళ్ళపాటు గుర్తుండిన ఆ కళ్ళను అప్పుడు కలలుగన్నాను. ఇప్పుడు వాటిని సూటిగా చూడగలిగే ధైర్యం నాకులేదు.

ఇప్పుడు....జయలక్ష్మిని ఉద్ధరించగలిగాననే గర్వం కూడా నాలో ఏ కోశానా లేదు.గర్వ పడాల్సింది నేను కాదు. బహుశా సాగర్ కూడా కాదు. పద్మబాల.... ఆమె ముఖానికి ఏ ముసుగులూ లేవు. ఎందుకు లేవో? నాలోకి నేను చూసుకుంటున్నాను.... O

● మార్చి 21 ఏప్రిల్ 5, 1994 - ఇండియాటుడే ●